క్లుప్తంగా

లలితాపీఠంలో షడావరణ అర్చన



లలితాపీఠంలో అర్చనలందుకున్న సుబ్రహ్మణ్యస్వామి

సీతంపేట: వైశాఖ శుద్ధ షష్టి సందర్భంగా లలితాపీఠంలో సుబ్రహ్మణ్యస్వామికి షడావరణార్చన, హోమం పండితుల వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. పలువురు భక్తులు పాల్గొని పూజలు చేశారు. పుత్రార్థి, ధనార్థి, వివాహార్థి, సుఖజీవనం, కుజదోష పరిహారం కోసం సుబ్రహ్మణ్యస్వామికి అర్చన, హోమం చేయడం వల్ల సత్ఫలితాలు లభిస్తాయని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

క్విజ్ పోటీల విజేతలు వీరే..

సీతంపేట: శ్రీశ్రీ జయంతి సందర్భంగా విశాఖ రసజ్ఞ వేదిక నిర్వహించిన క్విజ్ పోటీల విజేతల వివరాలను సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ జి.రఘురామారావు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీశ్రీ జీవితం, సమగ్ర సాహిత్యంపై మంగళవారం పౌరగ్రంథాలయంలో వన్‌వర్డ్ ఆన్సర్స్ విధానంలో క్విజ్ పోటీలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ పోటీలో సీనియర్ విభాగంలో మొదటి బహుమతికి బి.మణినాగేంద్రరావు, రెండో బహుమతికి శేఖరమంత్రి ప్రభాకర్, దుర్గాప్రసన్న, మరడాన సుబ్బారావు ఎంపికై నట్లు తెలిపారు. అలాగే జూనియర్ విభాగంలో బి.వి.రామకృష్ణ, పి.సురేష్‌కుమార్ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో గెలుపొందారని తెలియజేశారు. విజేతలకు ఈ నెల 30న అంకోసాలో జరగనున్న శ్రీశ్రీ జయంతి వేడుకల్లో అతిథుల చేతుల మీదుగా నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతమ్మధార : విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించే నిమిత్తం శుక్రవారం ఆశీలుమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలో 11 కేవీ పీ అండ్ టీ కాలనీ, 11 కేవీ శాంతిపురం, 11 కేవీ బాలయ్య శాస్త్రి లేఅవుట్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా జోన్–1లో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు పీ అండ్ టీ కాలనీ, శాంతిపురం, బాలయ్యశాస్త్రి లేఅవుట్, ఎస్ఆర్ఐ ఆస్పత్రి పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.

సిలబస్ తొలగింపుపై 30న సమావేశం

సీతంపేట: నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) 10, 11 తరగతుల సిలబస్‌లో కొన్ని పాఠ్యాంశాలు తొలగించిందని, ఈ అంశంపై తల్లిదండ్రులు, విద్యావేత్తలు, మేధావుల అభిప్రాయం తెలుసుకోవడానికి సమావేశం నిర్వహిస్తున్నట్టు రైట్ టు ఎడ్యుకేషన్ కన్వీనర్ నరవ ప్రకాశరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30వ తేదీ ఉదయం 10 గంటలకు లంకపల్లి బుల్లయ్య కళాశాల ప్రాంగణంలో ఉన్న గాంధీ సెంటర్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. సదరన్ ఇండియన్ అలయన్స్ ఫర్ ఫండమెంటల్ రైట్ టు ఎడ్యుకేషన్, ఆల్ ఇండియా పేరెంట్స్ అసోసియేషన్, గాంధీ సెంటర్ సంయుక్తంగా సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలియజేశారు. సమావేశంలో విద్యావేత్తలు ఆచార్య బాలమోహన్‌దాస్, ఆచార్య వై.సత్యనారాయణ, ఆచార్య ఎస్.కృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ పాల్గొంటారని తెలిపారు. ఉత్సాహవంతులు పాల్గొని తమ అభిప్రాయాలు తెలపవచ్చని పేర్కొన్నారు.

50వ వార్డులో జనసేన ప్రచారం

మురళీనగర్: జీవీఎంసీ 50వ వార్డ్ తెన్నేటినగర్‌లో జనంలోకి జనసేన కార్యక్రమాన్ని ఆ పార్టీ విశాఖ ఉత్తర నియోజక వర్గ ఇన్‌చార్జి పసుపులేటి ఉషా కిరణ్ బుధవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి పార్టీ ఆశయాలను ఆమె వివరించారు. కార్యక్రమంలో సనపల శివ సాగర్, ఎ.మురళి, కిషోర్, వెంకటరమణ, శ్యాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొండవాలు.. కానరాని వసతులు

- 45వ వార్డు పరిధిలో దశాబ్దాలుగా సమస్యలు
- అటు భీమిలికి దూరం.. ఇటు 'ఉత్తర' కు చెందని ప్రాంతం
- రెంటికీ చెడ్డ రేవడిలా పలు కాలనీలు
- స్థానికుల అవస్థలు



వరాహగిరి కాలనీ-2లో శిథిల డ్రైనేజీలు



సింహగిరి కాలనీలో ప్రమాదకరంగా బాల్యం భవనం



సత్యసాయినగర్‌లో పై కప్పులు లేక ప్రమాదకరంగా డ్రైనేజీలు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డులోని పలు కొండవాలు ప్రాంతాల్లో సమస్యలు నెలకొన్నాయి. గణేష్‌నగర్, వరాహగిరి కాలనీ–1,2, సత్యసాయి నగర్, సింహగిరి కాలనీ, సింగాలమ్మపురం ఈ జాబితాలో ఉన్నాయి. వాస్తవానికి ఇవి ఉత్తర నియోజకవర్గ పరిధిలో ఉండాల్సింది. కానీ భీమిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉన్నాయి. వార్డుల పునర్విభజన జరిగినా, ఈ వార్డు పరిధి మాత్రం మారలేదు.

అధ్వానంగా రోడ్లు, డ్రైనేజీలు

ఈ కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు, మెట్లమార్గాలు కొన్ని దశాబ్దాల క్రితం వేశారు. అవి శిథిలమై ప్రమాదకరంగా మారాయి. ఈ కాలనీల వాసులకు అంగన్‌వాడీ కేంద్రం లేదు, సామాజిక భవనం లేదు, పీహెచ్‌సీ లేదు. ఒక ప్రభుత్వ పాఠశాల కూడా అందుబాటులో లేదు. ఏ కష్టం వచ్చినా కొండ కింద దాడి రామమూర్తి కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన యూపీహెచ్‌సీకి, లేదా ప్రైవేటు హాస్పిటల్స్‌కు గానీ పరుగులు తీయాల్సిందే.

శిథిలావస్థలో బాల్యం భవనం

సింహగిరి కాలనీలో బాల్యం భవనం ప్రమాదకరంగా ఉంది. ఈ భవనం గోడల పునాదుల నుంచి మహావృక్షం మొలిచింది. దీంతో గోడలు బీటలు వారి, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. నిత్యం కనీసం 20మంది చిన్నారులు ఈ భవనంలో తరగతులకు ప్రతీరోజు హాజరవుతున్నారు. దీనిపై అధికారులకు విన్నవించడంతో వారు వచ్చి చూసి వెళ్లారు గానీ, చర్యలు శూన్యం.

సామాజిక భవనం కోసం నిరీక్షణ

సత్యసాయినగర్‌లో సామాజిక భవనం నిర్మించాలని ఎంతో కాలంగా స్థానికులు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో సామాజిక భవనానికి అనువుగా స్థలం ఉంది. బడ్జెట్ కూడా మంజూరైందని చెబుతున్నా పనులు మాత్రం ప్రారంభం కావడం లేదు. దీంతో ఏ శుభకార్యమైనా లక్షల్లో ఖర్చు చేసి ప్రైవేటు ఫంక్షన్ హాల్స్‌ను ఆశ్రయించాల్సి వస్తుంది.

తమ ప్రాంతాలు పక్కనే ఉన్న ఉత్తర నియోజకవర్గంలో కాక దూరంగా ఉన్న భీమిలి నియోజకవర్గానికి చెందడంతో తమ సమస్యలు తెలియజేయాలన్నా కష్టమవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను జీవీఎంసీ, ఉత్తర నియోజకవర్గ పరిధిలో కలపాలని పలుమార్లు వినతిపత్రాలు సమర్పించామని స్థానికులు, స్థానిక నాయకులు తెలియజేస్తున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

త్వరలోనే పనులు ప్రారంభం



సత్యసాయి నగర్, వరాహగిరి కాలనీలలో డ్రైనేజీ పనులకు మంజూరు లభించింది. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో త్వరలోనే శంకుస్థాపన చేసి, పనులు ప్రారంభిస్తారు. సింహగిరి కాలనీ బాల్యం భవనానికి టెండర్ పిలవాలి. టెండరు ప్రక్రియ పూర్తవగానే పనులు ప్రారంభమవుతాయి.

– కంపా హనోక్, కార్పొరేటర్

ఉల్లంఘనలపై కొరడా!

- పెండింగ్ చలాన్ల వసూలుపై దృష్టి
- ప్రమాదాల నివారణకు చర్యలు
- ట్రాఫిక్ పోలీసుల నిరంతర కృషి



హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్న సీఐ మళ్ల అప్పారావు



ఎస్‌పీడీ జంక్షన్‌లో ఆటోల పెండింగ్ ఫైన్లు వసూలు చేస్తున్న సీఐ మళ్ల అప్పారావు

గోపాలపట్నం: రాంగ్ రూట్ ప్రయాణాలు.. సిగ్నల్ జంపింగ్‌లకు చెక్ పెట్టడంపై పోలీసులు దృష్టిసారించారు. దీనిలో భాగంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలకు దిగుతున్నారు. భారీగా చలాన్లు పడిన వాహనదారుల నుంచి జరిమానాలు వసూలు చేయడానికి ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు.

కోవిడ్ తర్వాత చాలా మేరకు ట్రాఫిక్ పోలీసులు మానవతా దృక్పథంతో ఫైన్లు వేయకుండా చూసీ చూడనట్లు వ్యవహరించారు. అయితే ఇదే అలుసుగా చేసుకుని వాహనచోదకులు, ఆటో వాలాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు వారిని నియంత్రణలోకి తీసుకు వచ్చేందుకు కఠిన చర్యలు చేపట్టారు.

ఒక్కో వాహనంపై 30 వరకూ చలనాలు

ఎస్‌పీడీ జంక్షన్ పరిసర ప్రాంతాల్లో తిరిగే పలు ఆటోలకు 20 నుంచి 30 వరకు పెండింగ్ ఫైన్లు ఉన్నాయంటే వారి ఉదాసీనత ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. దీంతో కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు పెండింగ్ ఫైన్లు వసూలు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.

పాదచారుల రక్షణ కోసం...

పాదచారుల కోసం నిర్మించిన ఫుట్‌పాత్‌లు ఆక్రమించిన వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా చర్యలు చేపట్టారు. ఎస్‌పీడీ నుంచి కంచరపాలెం వరకు ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు.

స్పెషల్ డ్రైవ్‌లో నమోదు చేసిన కేసులు.. జరిమానాలు

పాత చలానాలు (ఆటోలు, ద్విచక్రవాహనాలతోపాటు) మొత్తం	3,951
పాత చలానాలు వసూలు చేసిన సొమ్ము	రూ12,82,350
కొత్త చలానాలు వేసినవి	4,919
కొత్త చలానాల ద్వారా వేసిన అపరాధ రుసుము	రూ10,73,300

హెల్మెట్ లేకుండా వాహనం నడిపే వారిపై 3176 మంది వాహన చోదకులపై ఫైన్లు వేశారు.

హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన



హెల్మెట్ వాడకంపై వాహన చోదకుల్లో అవగాహన కల్పిస్తున్నాం. చాలా వరకు ప్రజల్లో అవగాహన కలిగింది. హెల్మెట్ వాడకం బాగా పెరిగింది. గతేడాదిలో జరిగిన ప్రమాదాల్లో ఎంత మంది చనిపోయారో వాహన చోదకుని అర్థమయ్యేలా వివరిస్తున్నాం. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరుతున్నాం. అతివేగం జిగ్ జాగ్ డ్రైవింగ్, మౌర్ డ్రైవింగ్ చేయరాదని అవగాహన కల్పిస్తున్నాం.దీంతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు నిరంతర చర్యలు చేపడుతున్నాం. దీనిలో భాగంగా పెండింగ్ చలాన్లు వసూలు చేస్తున్నాం. కొత్తగా కేసులు నమోదు చేస్తున్నాం. – మళ్ల అప్పారావు, ట్రాఫిక్ సీఐ కంచరపాలెం

ఉపాధ్యాయులకు సకాలంలో వేతనాలు



సువర్ణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

విశాఖ విద్య: జీవీఎంసీ నుంచి పాఠశాల విద్యలో విలీనమైన ఉపాధ్యాయులకు సకాలంలో వేతనాలు అందేలా తనవంతు కృషి చేస్తానని అర్బన్ డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ కె. సువర్ణ అన్నారు. ప్రైమరీ స్కూళ్లలోని ఉపాధ్యాయులకు డ్రాయింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న ఆమెను పీఆర్‌టీయూ అర్బన్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం కలసి అభినందనలు తెలిపారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు హరికృష్ణ, నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి దామోదర్, కౌన్సిలర్ కనకరాజు ఆధ్వర్యంలో సువర్ణకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువతో సత్కరించారు. సువర్ణ మాట్లాడుతూ ఒకే గొడుగు కింద పాఠశాల విద్య, మున్సిపల్ విద్య వచ్చినందున ఉపాధ్యాయులంతా కలసి విద్యాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఉపాధ్యాయుల సర్వీసు పరమైన సమస్యలపై పీఆర్‌టీయూ నాయకులు ఆమె దృష్టికి తీసుకురాగా, తన పరిధిలోని వాటిని సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానన్నారు. సంఘం మహిళా అధ్యక్షురాలు భారతి, కార్యదర్శి లలితాంబ, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్‌రావు, జిల్లా కార్యదర్శి రవి, కరుణాకర్, విజయబాబు, స్వామి, సరస్వతి, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

నాటక రచయితలకు సత్కారం



రచయితలను సత్కరిస్తున్న ప్రముఖులు

సీతమ్మధార: రంగసాయి నాటక గ్రంథాలయం 11వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని గ్రంథాలయ ప్రాంగణంలో బుధవారం జరిగిన వేడుకల్లో నాటక రచయితలు, నటులు, దర్శకులు పాల్గొన్నారు. వ్యవస్థాపకులు బాదంగీర్‌సాయి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాటక రచయితలు కొరిటాల ప్రభాకరరావు, పీటీ మాధవ్, దండు నాగేశ్వరరావు, విశ్వనాథ గణపతిరావు, రాని వెంకటేశ్వరరావును రంగస్థల నటులు, రచయిత డాక్టర్ మీగడ రామలింగస్వామి, డాక్టర్ రాజా కృష్ణమూర్తి, వీవీ రమణమూర్తి సత్కరించారు. నట, దర్శకుడు పి.శివప్రసాద్ పర్యవేక్షణలో బాల నటులు సుమంత్, నవనీత్ కన్యాశుల్కం నాటకం ప్రదర్శించారు. నవ చైతన్య కళానాట్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 'అలూ లేదు చూలూ లేదు కొడుకు పేరు సోమలింగం 'హాస్య ప్రహసనాన్ని చిన్నారెడ్డి, పోతురాజు పద్మ ప్రదర్శించారు. పలువురు కళాకారులు పాల్గొన్నారు.

స్కీం ఇళ్ల లబ్ధిదారులకు నగదు చెల్లింపు



దరఖాస్తులు అందజేస్తున్న లబ్ధిదారులు

సీతంపేట: టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్‌టీఆర్ స్కీం ఇళ్ల కోసం గతంలో డబ్బులు చెల్లించిన వారికి తిరిగి డబ్బులు చెల్లిస్తున్నారు. జీవీఎంసీ జోన్–3 పరిధిలో 14 నుంచి 27 వార్డుల వరకు సుమారు రెండు వేల మంది స్కీం ఇళ్ల కోసం రూ.500, 12,500, 25 వేలు, 50 వేలు, లక్ష చొప్పున చెల్లించారు. వారిలో 1300 మందికి తిరిగి డబ్బులు చెల్లించారు. మిగిలిన లబ్ధిదారులకు నెల రోజుల్లో డబ్బులు చెల్లించడానికి సన్నాహాలు చేస్తున్నట్టు యూసీడీ ఏపీడీ దుర్గాప్రసాద్ తెలిపారు. గతంలో డబ్బులు కట్టిన వారు ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం, డీడీ జిరాక్సు కాపీలతో చేసిన దరఖాస్తులను ఏపీడీ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం స్వీకరించి వివరాలు నమోదు చేసుకున్నారు. దీంతో జోన్–3 కార్యాలయం దరఖాస్తుదారులతో బారులుతీరింది. నమోదు అనంతరం దరఖాస్తులు పరిశీలించి లబ్ధిదారులకు చెక్కులు జారీ చేస్తామని ఏపీడీ తెలిపారు.

రేపు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం సెక్షన్ ఈస్ట్‌గేట్ 11కేవీ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, నిర్వహణ పనుల నిమిత్తం సంబంధిత ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈపీడీసీఎల్ జోన్–1 ఈఈ (ఆపరేషన్స్) జి.సత్యనారాయణ తెలిపారు. బాలయ్య శాస్త్రి లేఅవుట్, రాఘవేంద్ర హాస్పిటల్, ఫుడ్ ఎక్స్, స్పా సెంటర్ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

ఎస్ఎస్‌టీఎల్ సెక్షన్ పరిధిలో..

మద్రిపాలెం: జోన్–2 ఎస్ఎస్‌టీఎల్ సెక్షన్ పరిధిలోని అన్ని 11కేవీ ఫీడర్ల నిర్వహణ ప్రక్రియలో భాగంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బి.కె. నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా మాధవధార వుడా కాలనీ, కనకమహాలక్ష్మి టెంపుల్ రోడ్డు, శ్రీశాంతి ల్యాండ్‌మార్క్, విజేత మార్ట్ ఏరియా, మాధవధార, అంబేడ్కర్ కాలనీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఏరియా, కనకదుర్గ ఫంక్షన్‌హాల్ జంక్షన్, జనత గ్యారేజ్ జంక్షన్, గ్యాస్ గొడౌన్ జంక్షన్, సాకేతపురం, వినోద్‌నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. విమాన్‌నగర్, కాకానినగర్, ఎస్‌పీడీ, అంబేడ్కర్ నగర్, సాయినగర్, జాకీర్‌హుస్సేన్ నగర్, పార్వతి నగర్, జర్నలిస్ట్ కాలనీ, గాంధీనగర్, రైతుబజార్ ఏరియా, రాజీవ్‌నగర్, గంగాగోదావరి అపార్ట్‌మెంట్, అప్పయ్యనగర్, గాంధీ నగర్, మహాత్మా కాలనీపార్క్ ప్రాంతాల్లోనూ అంతరాయం ఏర్పడుతుందని తెలియజేశారు. వంశీనగర్, జీఐఎస్ ఏరియా, వుడా అపార్ట్‌మెంట్స్, ఓల్డ్ కరాస, న్యూ కరాస, కళింగనగర్, సీతన్న గార్డెన్స్, నరసింహనగర్, ఎంఎస్ఆర్ పార్క్, విద్యానగర్, లేన్‌సమ్ అపార్ట్‌మెంట్స్, దుర్గాపురం, శాంతినగర్, జ్యోతినగర్, ఈపీఎఫ్ ఆఫీస్ ఏరియా, ఆర్ అండ్ బీ జంక్షన్, మద్రిపాలెం వుడా లేఅవుట్, లక్ష్మీనగర్, మహత్ కాలనీ, రామన్న కాలనీల్లో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కథలు సమాజ ప్రతిబింబాలు



మాట్లాడుతున్న రచయిత ఎల్.ఆర్.స్వామి

సీతంపేట: కథలు సమాజ వాస్తవికతకు ప్రతిబింబాలని ప్రముఖ కథా రచయిత ఎల్.ఆర్.స్వామి అన్నారు. సహృదయ సాహితి ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో బుధవారం సాయంత్రం నిర్వహించిన కథా కచేరీలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. చక్కటి శైలి, శిల్పంతో జనరంజకంగా రచనలు చేయాలన్నారు. సాహిత్యం వల్ల మనశ్శాంతి, పరివర్తన కలుగుతాయన్నారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కవులు, రచయితలు సాహిత్యాన్ని, తెలుగు భాషను, సమాజ వాస్తవికతను లోకానికి అందించే మార్గదర్శకులన్నారు. ప్రముఖ రచయిత డి.వి.సూర్యారావు మాట్లాడుతూ సాహిత్య సంస్థలు చురుగ్గా పని చేయాలని, కవులు, రచయితలకు మంచి వేదికగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ చినసూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణమూర్తి, రచయితలు యాళ్ల రాజేష్, కేవీఎస్ మూర్తి, కొత్తూరి రమణ, రామతాత, కుప్పిలి భీమేశ్వరరావు, వేదుల కామేశ్వరశర్మ, బి.రాధారాణి తదితరులు కథలు చదివి వినిపించారు.

ఘనంగా కేవీ-2 వార్షిక వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు



సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం విజయనగర్ కాలనీ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని కేంద్రీయ విద్యాలయం–2లో బుధవారం పాఠశాల 36వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఐఎన్ఎస్ శాతవాహన కమాండింగ్ అధికారి, కేంద్రీయ విద్యాలయాల మేనేజింగ్ ఛైర్మన్ రాజత్ నాగ్‌పాల్ ముఖ్య అతిథిగా పాల్గొని వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశే కీలకమన్నారు.విద్యా వ్యవస్థలో మార్పులకు అనుగుణంగా బోధన జరగాలని సూచించారు. విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కళల పట్ల ఆసక్తి చూపాలని కోరారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు బి.రామచంద్రరావు, బాలాజీ, సింహాద్రి, కె.వి.ఎస్. రామశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి భానోజీరావు



భానోజీరావు వర్ధంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు

డాబాగార్డెన్స్: మహోన్నత వ్యక్తి అంకిత వెంకట భానోజీరావని పలువురు వక్తలు కొనియాడారు. ఏవీ భానోజీరావు 45వ వర్ధంతి సందర్భంగా నగరంలోని ఏవీఎన్ కళాశాల ఆవరణలో గల ఆయన విగ్రహానికి కళాశాల యాజమాన్యం, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లోనూ, ప్రజాప్రాతినిధ్యంలోనూ, సామాజిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో భానోజీరావు పేరొందారన్నారు. విశాఖ నుంచి శాసన సభ్యుడిగా ప్రాతినిధ్యం వహించి విశాఖపట్నాన్ని శాశ్వత అభివృద్ధి వైపు నడిపించారన్నారు. విజయవాడలో ఉన్న ఆంధ్రా యూనివర్శిటీని విశాఖపట్నం తరలించేందుకు తమ సొంత భూములు దానం చేసిన వితరణ శీలిగా పేర్కొన్నారు. కళాశాల సూపరింటెండెంట్ సత్యనారాయణ మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాకముందు, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎమ్మెల్యేగా, మున్సిపల్ చైర్మన్‌గా శాశ్వత అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి నగరాభివృద్ధికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ మంగమ్మ, పైడి రజని, వివిధ విభాగాల అధ్యాపకులు కృష్ణకుమారి, శ్రీనివాస్, సంతోషి, అర్చన పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీ దళార్చన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సాప్ చేయాలి.

వైభవుని కల్యాణ శుభలేఖల ఆవిష్కరణ నేడు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల శుభలేఖల ఆవిష్కరణ కార్యక్రమం గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. సాయంత్రం 6.30గంటలకు కల్యాణ దాతల సమక్షంలో వైభవుడు, భూదేవి, శ్రీదేవిల తరపున శుభలేఖలు ఇచ్చిపుచ్చుకుంటారని, దాతలందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

ఇంటర్‌లో బుల్లయ్య విద్యార్థుల ప్రతిభ

సీతంపేట: లంకపల్లి బుల్లయ్య కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటారు. ద్వితీయ సంవత్సరంలో ఎం.భార్గవి (ఎంపీసీ) 971/1000, టి.వైష్ణవి (బైపీసీ) 971/1000, కె.భానుతేజ (సీఈసీ) 883, డి.ఆశ్లేష (ఎంఈసీ) 925 మార్కులు సాధించి కళాశాల టాపర్లుగా నిలిచారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో కె.మధులత (ఎంపీసీ) 453/470, పి. అక్షయ (బైపీసీ) 405/440, కె.కీర్తన (సీఈసీ) 451/500 మార్కులు సాధించి కళాశాల టాపర్లుగా నిలిచారు. మొత్తంగా మొదటి సంవత్సరంలో 335 మంది పరీక్షలకు హాజరు కాగా 157 మంది ఉతీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 351 మంది హాజరు కాగా 211 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందించారు.

ఎట్టకేలకు తెరచుకున్న కేజీహెచ్ గేటు



తెరచుకున్న కేజీహెచ్ ప్రధాన గేటు

మహారాణిపేట : కేజీహెచ్‌కు రాకపోకలు సాగించే ప్రధాన మార్గం ఎట్టకేలకు తెరచుకుంది. ఇన్‌గేట్ పునర్నిర్మాణానికి మొత్తం గేటును కొన్నాళ్ల కిందట మూసేసిన సంగతి తెలిసిందే. దీనిపై సాక్షిలో ఈనెల 14న 'ప్రవేశానికి పాట్లు' శీర్షికన వార్త ప్రచురితమైంది. మంగళవారం కేజీహెచ్‌లో ఆధునాతన సత్రం ప్రారంభించడానికి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని రావడంతో గేటు తెరుచుకుంది. దీంతో నిత్యం రాకపోకలు సాగించే రోగులు, వారి బంధువులు, వైద్యులు, ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు.